క్లుప్తంగా

రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో విజయబాబు తెలిపారు. మండల గ్రామాలైన మోరంపూడి, రేవేంద్రపాడులలో గురువారం నిర్వహించిన పోలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అర్హత కలిగిన రైతులు 8,365 ఉండగా.. 8,032 రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు శుక్రవారం లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్ సాగు కోసం సబ్సిడీపై విత్తనాలు, కౌలు రైతుల సాగు హక్కు పత్రం కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్


తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లి హరిజనవాడలో గత ఐదు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై సాక్షిలో గురువారం 'వృథాగా పోతున్న తాగునీరు!' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ అలీమ్‌బాషా ఉండవల్లి హరిజనవాడలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో ఉండవల్లి వాటర్ లైన్‌కు చెందిన సిబ్బంది వెంటనే మరమ్మతులు నిర్వహించి తాగునీటి వృథాను అరికట్టారు. పైపులైన్‌ను మరమ్మతులు చేయించిన కమిషనర్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు.

అపరిశుభ్రంగా మురుగు కాలువ



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్ యూపీహెచ్‌సీ సమీపంలో రోడ్లపై మురుగు పారుతూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీలో పురుగులు సైతం తాండవిస్తున్నాయని, ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని సాక్షిలో కథనం వెలువడింది. కార్పొరేషన్ అధికారులు సైతం రోడ్డుపైకి మురుగు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గురువారం మరోసారి అక్కడకు వెళ్లి పరిశీలించగా డ్రైనేజీలు మాత్రం పురుగులతో అపరిశుభ్రంగా దర్శనమిచ్చాయి. ఆ పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే డ్రైనేజీని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

నవధాన్యాల సాగు పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని 113.తాళ్లూరు గ్రామంలో మిర్చిపంట వేసేముందు రైతుల పొలాల్లో వేసిన నవధాన్యాల సాగును జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటపొలాలు సాగు చేసుకునే ముందు ప్రతి రైతు 30 రకాల విత్తనాలతో పంటను వేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎకరానికి రెండు కిట్లు చొప్పున వేసుకున్నట్లయితే భూమిలో కోల్పోయిన ఖనిజ లవణాలను సేంద్రీయ కర్బణాన్ని తిరిగి పొందవచ్చన్నారు. వీటి ద్వారా భూములు సారవంతం అవుతాయని చెప్పారు. ప్రధాన పంటతో పాటు అంతర పంటలుగా ఉల్లి, ముల్లంగి వంటివి వేసుకోవాలని సూచించారు. 45 రోజుల తరువాత నవధాన్యాల పంటను ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన పంటను పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికల ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేస న శంకరరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్-విజయవాడ బృందం కంటి పరీక్షలు చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తా



వేమారెడ్డిని సత్కరిస్తున్న గోరేబాబు



వజ్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బేతపూడి రాజేంద్ర

మంగళగిరి టౌన్: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎండి గోరే బాబు అన్నారు. గురువారం మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమారెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర మైనార్టీ ప్రధానకార్యదర్శిగా తమకు అవకాశం కల్పించినందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పదవి రావడానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇచ్చిన పదవికి న్యాయం చేస్తాని.. బాధ్యతగా స్వీకరిస్తానని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆశయాలు, సంకల్పాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ, మండల వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

తాడికొండ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంకు చెందిన బేతపూడి రాజేంద్రను నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్)ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాజేంద్రను శాలువాతో సత్కరించిన డైమండ్ బాబు పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసి రానున్న ఎన్నికల్లో తాడికొండలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేయాలని సూచించారు. తమపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపిన రాజేంద్ర కూటమి సర్కారుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాజయం తప్పదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి బత్తుల కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, రాష్ట్ర నాయకులు ఆరేపల్లి జోజి, వివిధ విభాగాల నాయకులు డీజే శ్రీనివాస్, బేతపూడి వికాస్, పి.మహేష్, పి.అరవింద్, పి.నతానియేలు, జి.కోటేశ్వరరావు, నందిగం రాజాజీ, ఐ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు రోడ్డు విస్తరణకు సన్నాహాలు



కొలతలు వేసి మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఆర్‌డీఏ అమరావతికి ప్రధాన రహదారి అయిన నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణకు ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా ప్రభుత్వం నిర్ణయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి నిడమర్రు మీదుగా అమరావతి సచివాలయానికి 155 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిడమర్రు రోడ్డు లోని పలు నివాసాలు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాక నిడమర్రు, కురగల్లుతో పాటు పలు గ్రామాలలో స్థానికులు నివాసాలను సగానికిపైగా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా సీఆర్‌డీఏ సిబ్బంది సర్వే చేస్తుండగా స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టడానికి తాము వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్ణయం మార్చుకుని రోడ్డు విస్తరణను తగ్గించి తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న తమకు సరైన నష్టపరిహారం అందేలా అధికారులు, ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

వానరాలతో ఇక్కట్లు!



గోడపై తిష్ట వేసిన వానరాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వానరాల బెడద ఎక్కువైంది. పదుల సంఖ్యలో ఉన్న వానరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం భయంగా రావాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలోని రాజాపేట, కొండమెట్లబజార్, జెండాచెట్టు సెంటర్, రామాలయం వీధి, బాల ఏసుదేవాలయ సమీప ప్రాంతం, హైస్కూల్ సెంటర్ ప్రాంతాల్లో ఈ వానరాలు గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. పాఠశాలలకు వెళుతున్న పిల్లలు, పనులకు వెళ్లే వారి వెంటపడి కొందరిని గాయపరిచాయి. పంచాయతీ అధికారులు స్పందించి వానరాలను పట్టించి అడవి ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యోగాతో విద్యార్థులకు జ్ఞాపకశక్తి



యోగా సాధన చేస్తున్న చిన్నారులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: యోగా చేయడంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష అన్నారు. మంగళగిరి నగర పరిధి చినకాకానిలోని షైన్ ఆనంద శరణాలయంలో గురువారం బాలబాలికలకు యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆరోగ్యంపైన కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. నేడు విద్యలో పోటీతత్వం పెరిగి విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతోందన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని.. చదివిన పాఠ్యాంశాలు కూడా గుర్తుండి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. రోజూ యోగా సాధన చేయడం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం యోగా గురించి రాధాకృష్ణ బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు డీజీ నాయక్, సంధ్యారాణి, బాలబాలికలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై యాజమాన్యం స్పందించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కరించడంలో యాజమాన్యం ఇప్పటికైనా స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ విజ్ఞప్తి చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 198 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని, యాజమాన్యం లేదా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రతీ కార్మికుడు వయసు మీద పడి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షేక్ సుభాని, షేక్ ఆసిఫ్, ఎం.గురవయ్య, దర్శి మాణిక్యరావు, తుపాకుల నాగేశ్వరరావు, కె.హగ్గయ్య, రమణ, శివకుమారి, కాసమ్మ, సారమ్మ, లక్ష్మి, బి.సూర్యప్రకాశరావు, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30న ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

28,29 తేదీల్లో 'రథ్‌ఫెస్ట్' వివిధ అంశాల్లో చిన్నారులు, యువతకు పోటీలు



పోస్టర్లను ఆవిష్కరించిన సింహగౌరదాస్

తెనాలి: 'ఇస్కాన్', తెనాలి ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఈనెల 30వ తేదీన జరగనుంది. నాలుగురోజులు జరిగే ఈ ఉత్సవాల కు సంబంధించిన రథ్ ఫెస్ట్ పోస్టర్లను గురువారం సాయంత్రం ఇస్కాన్‌లో ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. రథయాత్రకు ముందు ఈనెల 28, 29 తేదీల్లో రథ్ ఫెస్ట్ పేరిట పిల్లలకు, యువతకు సాంస్కృతిక పోటీలను జరపనున్నట్టు ఇస్కాన్, తెనాలి మేనేజరు హెచ్‌జీ సింహగౌరదాస్ వెల్లడించారు. 5–30 ఏళ్ల వరకు మూడు వయో విభాగాల్లో 51 పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 26వ తేదీలోగా 70131 32678, 70131 27778 నంబర్లను సంప్రదించాలని కోరారు. 30వ తేదీన రథయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు శివాజీచౌక్ నుంచి బయలుదేరుతుందని అన్నారు. ఒకటో తేదీ రాత్రి వరకు అక్కడ ఏర్పాటుచేసే గుండిచా మందిరంలో జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర మాత కొలువై ఉంటారని తెలిపారు. ఒకటో తేదీ సాయంత్రం సుభద్ర దేవికి సౌభాగ్య సారె కార్యక్రమం ఉంటుదని వివరించారు.

యోగా దినోత్సవంపై అవగాహన సదస్సు

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యోగా పర్యవేక్షణ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీవో పూషాడపు శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా యోగా పర్యవేక్షణ చేసేలా ఇన్‌చార్జులను నియమించామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు ఎక్కువ మంది పాల్గొనేలా చేసి వారికి యోగాపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, సూపరింటెండెంట్ రవిబాబు, ఎంఈవో షేక్.మహబూబ్ సుభాని, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన



దుగ్గిరాల: గ్రామీణ స్థాయిలో డయేరియా వ్యాధిని నివారించాలని వ్యాక్సినేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రావణ బాబు అన్నారు. గురువారం దుగ్గిరాల ఆరోగ్య కేంద్రంలో దుగ్గిరాల, ఈమని, పెదవడ్లపూడి ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య పర్యవేక్షులు, ఆరోగ్య కార్యకర్తలకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఈసీడీఎస్, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలతో సమన్వయం చేసుకోని డయేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్, వి.సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడిపై కేసు

మంగళగిరి టౌన్: గంజాయి కలిగిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మంగళగిరి ప్రొబెషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.వీరాంజనేయులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడేపల్లి మండల పరిధిలోని మహానాడుకు చెందిన నందు అనే యువకుడి దగ్గర గంజాయి ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో మహానాడులోని 9వ రోడ్డులో తన సిబ్బందితో దాడులు నిర్వహించామని అన్నారు. యువకుడిని తనిఖీ చేయగా 1.2 కేజీల గంజాయిని దొరికిందని.. దానిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం నందుని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది సందీప్, సుధీర్, శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

టి.బి.యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి.రవికుమార్



ర్యాలీలో పాల్గొన్న రవికుమార్

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని టి.బి.యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని అంగలకుదురులో గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం ఉన్నట్లయితే పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట రావడం, కళ్లెలో రక్తం కనబడటం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో క్షయ వ్యాధి పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వీ వాకా దిలీప్‌కుమార్, సౌజన్య, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్య కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఇందిరకు ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్, జూనియర్ కళాశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని.. అకాడమీల పేరుతో కళాశాలలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక కార్పొరేట్ కళాశాలలో అకాడమీల పేరుతో ఇంటర్ బోర్డు గుర్తింపు లేని జూనియర్ కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఎంసెట్, నీట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పేరుతో లాంగ్ టర్మ్ కోచింగ్ పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ఇటువంటి కళాశాలలను సీజ్ చేయాలని ఇంటర్మీడియట్ కమిషనర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఫణీంద్ర, సాయికుమార్, షాబీర్ బాషా, రాష్ట్ర సమితి సభ్యులు రంగస్వామి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు



వ్యర్థాలను వదులుతున్న నిర్వాహకుడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. గతంలో వీరు నిర్వహిస్తున్న చేష్టలపై కథనాలు వెలువడినా అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. గురువారం సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ నిర్వాహకులు పంట కాలువలో మలమూత్ర వ్యర్థాలను వదిలి అక్కడి నుంచి పరారైన సంఘటన వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట నుంచి మాతాశ్రీ ఆశ్రమం మీదుగా ఉండవల్లి గుంటూరు చానల్ ఎక్స్‌క్లూయిస్‌కు వెళ్లే మార్గంలో గుంటూరు చానల్ పక్కన తెనాలి, గుంటూరు, తాడేపల్లి, మంగళగిరి తాగునీటి కాలువలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదిలివేశారు. గమనించిన స్థానికుడు జిలానీ అనే వ్యక్తి దీనిపై నిర్వాహకుడిని ప్రశ్నించారు. ఈ వాహనం మున్సిపాలిటీకి చెందినదని.. ఆ నీళ్లే తీసుకువచ్చి ఇక్కడ వదులుతున్నాను అంటూ నిర్వాహకుడు సమాధానం చెబుతూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గతంలోనూ ఇలాంటి ఘటనలు ఇక్కడ కోకొల్లలని స్థానికులు వాపోయారు. మున్సిపల్ అధికారులు సంబంధిత వాహనాన్ని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కార దిశగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ స్వప్న, జెడ్పీటీసీ సిద్ధయ్య

మేడికొండూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీవో కె.డేవిడ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న, జెడ్పీటీసీ కందుల సిద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించామని అన్నారు. సిరిపురం, పేరేచర్ల క్వారీ ప్రాంతాలలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. ఈ విషయంపై మండల గ్రామీణ అభివృద్ధి రక్షిత మంచినీటి పథకం అధికారి సుజాత సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో పలువురు మండల శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ హాస్టల్ భవనాల నుంచి మురుగు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ హాస్టల్ భవనాల నుంచి విడుదలవుతున్న మురుగునీటిని అరికట్టాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు నివాసముంటున్న భవనాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా నిర్మించుకోకపోవడంతో నిర్వాహకులు రహదారిపై మురుగునీటిని వదులుతున్నారని.. దీంతో రహదారిపై ప్రయాణించే గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారని ఆయన అన్నారు.

ఆత్మకూరు చెరువుపై డేగకన్ను!



ఆత్మకూరు చెరువుపై నిర్మించిన రేకుల షెడ్డు

టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కొందరి కళ్లు ఆత్మకూరులోని చెరువు భూమిపై పడ్డాయి. సర్వే నెంబర్ 143లో గల చెరువు భూమి ఆక్రమణకు గురవుతోంది. అధికార పార్టీ నేతల అండతో చెరువు భూమిని ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించినా అధికారులకు కనిపించకపోవడం స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది. టీడీపీ కార్యకర్త 10 సెంట్ల చెరువు స్థలం ఆక్రమించి షెడ్డు నిర్మించినా అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఎంతో విలువైన చెరువు స్థలం ఆక్రమించి బహిరంగంగా షెడ్లు నిర్మిస్తున్నారని.. వెంటనే అధికారులు చెరువు భూమి ఆక్రమణను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ వీఆర్వో ఎ.గుదారి అంకయ్యను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని.. వెంటనే పరిశీలించి ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆక్రమణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– ఆత్మకూరు(మంగళగిరి)

విద్యామిత్ర కిట్లను వెంటనే అందజేయండి

ఆర్ఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ పి.పార్వతి

తెనాలిఅర్బన్: స్టాక్ పాయింట్‌లకు వచ్చిన విద్యామిత్ర కిట్లను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని విద్యామిత్ర కార్యక్రమ జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ రాష్ట్ర డైరెక్టర్ పి.పార్వతి ఆదేశించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌ను గురువారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఇంకా కిట్లు ఉండటాన్ని గమనించిన ఆమె వాటిని ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే వారం రోజులు అయినా పంపిణీ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వాటన్నింటిని ఆయా పాఠశాలలకు పంపిచాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు తదితరులు ఉన్నారు.

ప్రకటన

ఇందు మూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పటమట బ్రాంచి, విజయవాడ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ఈ క్రింది షెడ్యూలులో చూపిన కుర్రా అప్పారావు గారి కుమారుడు కుర్రా శివశంకరరావు గారి స్థిరాస్తిని తనఖా చేసుకొని కుర్రా శివశంకరరావుగారి భార్య కుర్రా వెంకట ధనలక్ష్మి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని ఎటువంటి కోర్టు అటాచ్మెంట్లు గాని, క్లెయిమ్స్ గాని ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు రాతపూర్వకంగా తెలియజేయగలరు. తరువాత వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు: గుంటూరు డి. మంగళగిరి సబ్-డి యిలాకా తాడేపల్లి మం., చిర్రావూరు గ్రామపంచాయతీ ఏరియాలో వేంచేసి చిర్రావూరు గ్రామం తాలూకు డి. నెం. 51/3 బాపతు 2వ బ్లాకు, పాత డోరు నెం. 2-194/1, క్రొత్త డోరు నెం. 4-29లో (దఖలు దస్తావేజు నెం. 18715/2018, SRO- మంగళగిరి) లోగల చ.గ॥ 798.6లు నివేశన స్థలము అందలి ఆర్.సి.సి. డాబాకు హద్దులు: తూర్పు: కుర్రా సాంబశివరావు, శివనాగేశ్వరరావు గార్ల ఆస్తి హద్దు, దక్షిణం: మక్కపాటి రంగయ్య గారి ఆస్తి హద్దు, పడమర: పంచాయతి బజారు హద్దు, ఉత్తరం: బోరంపోక హద్దు.

ఇట్లు

Y.VIJAYA KUMAR, Advocate
20-4-21, Near Lotus Land Mark, Santhi Nagar, VIJAYAWADA-3. ✆ 99490 77010

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com